## క్లుప్తంగా

### ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



ఉత్సవమూర్తులను తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

**జలుమూరు:** ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరుడిని చైత్ర మాసం శుద్ధ బహుళ ఏకాదశి సందర్భంగా గురువారం తిరువీధి ఉత్సవం నిర్వహించారు. స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను అలంకరించి తిరువీధి నిర్వహించారు. అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన



నగర సంకీర్తన నిర్వహిస్తున్న సత్యసాయి భక్తులు

**నరసన్నపేట:** స్థానిక మారుతీనగర్ సత్య సాయి మందిరం ఆధ్వర్యంలో గురువారం ఆరాధన దినోత్సవం సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన చేపట్టారు. మధ్యాహ్నం మహానారాయణ సేవ ఏర్పాటు చేశారు. సాయంత్రం ఊరేగింపు చేపట్టారు. మారుతీనగర్ మందిరం కన్వీనర్ ఎం.ఎల్.నాయుడు, జగ్గు నాయుడు, రామకృష్ణ, పోటోజు నాగేశ్వరరావు అప్పలస్వామి, పరిసర వీధులకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### రెండు గడ్డి కుప్పలు దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డి కుప్పలు

**నరసన్నపేట:** మండలంలోని గోపాలపెంటలో రెండు గడ్డివాములు గురువారం ప్రమాదవశాత్తు దగ్ధమయ్యాయి. పశువుల మేతకు కోసం సాదు గరికెన్న, నక్క రామారావులు మూడెకరాల గడ్డిని కుప్పలుగా వేశారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వీటికి మంటలు అంటుకున్నాయి. గాలి తీవ్రత అధికంగా ఉండటంతో గడ్డి కుప్పలు దగ్ధమయ్యాయి. సమాచారం తెలుసుకున్న నరసన్నపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటన వద్దకు చేరి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డి పూర్తిగా కాలి బూడిదైంది. పశువుల ఆహారం కోసం నిల్వ చేసిన గడ్డి ఈ విధంగా కాలిపోవడంతో రైతులు ఆవేదన చెందారు.

### కొత్తూరు రచయితల వేదిక ఆవిర్భావం



కొరవే లోగోను ఆవిష్కరిస్తున్న తిరుమలరావు, తదితరులు

**కొత్తూరు:** కొత్తూరు మండల రచయితల వేదిక ఆవిర్భావం గురువారం జరిగింది. మండలంలోని కడుము జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కుదుము తిరమలరావు కొత్తూరు రచయితల వేదికను (కొరవే) స్థాపించారు. రచయితల వేదిక లోగోను తిరమలరావు రూపొందించారు. ఈ లోగోను వై.అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు రచయితలను సత్కరించారు. రచయితలు కలమట శ్రీరాములు, లమ్మల కామేశ్వరి జ్యోతి, అప్పలనాయుడు, మురళీకృష్ణ, బూరాడ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆమదాలవలస:** మున్సిపాలిటీలో భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసేందుకు స్ట్రక్చరల్ ఇంజినీర్‌గా లైసెన్స్ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎ.పి.ఎస్.జాన్సన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెక్నికల్ సర్వేయర్‌గా లైసెన్స్ పొందటానికి ఐటీఐ సివిల్, డిప్లమో సివిల్, బి.టెక్ సివిల్ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు మున్సిపల్ కార్యాలయానికి నేరుగా వచ్చి దరఖాస్తు అందజేయవచ్చన్నారు. ఏపీఓటీపీఎస్/ఏపీడీపీఎంఎస్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

### వైభవంగా ఆలయ వార్షికోత్సవం

**సారవకోట:** మండలంలోని వాండ్రాయిలో గల దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళ్లి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. ఆలయ శిఖరం మీద బూర్లె వేయగా మహిళలు చీర కొంగులు పట్టారు. అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

**కొత్తూరు:** మండలంలోని గొట్టిపల్లి గిరిజన పంచాయతీ పరిధి కొత్తగూడ గిరిజన గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి ఆధ్వర్యంలో స్వామివారి తిరువీధి చేపట్టారు. స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీహెచ్‌సీ కమిటీలకు.. తిలోదకాలు



సీహెచ్‌సీలకు రాయితీపై ఇచ్చిన వ్యవసాయ యంత్రాలు (ఫైల్)

- వైఎస్సార్‌సీపీ పాలనలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు
- ఈ కమిటీల ద్వారా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు
- అధిక ప్రయోజనాలు పొందిన అన్నదాతలు
- కూటమి పాలనతో వ్యక్తిగతంగానే రాయితీ పరికరాలు
- అనుకూల రైతులకు ప్రయోజనం కలిగేలా నిర్ణయం..



మూలకు చేరిన కియోస్క్ సేవలు (ఫైల్)

**ఎల్.ఎన్.పేట:** రైతు సంక్షేమానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. రైతులతో కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ) కమిటీలను ఏర్పాటు చేసింది. ఆయా కమిటీల ద్వారా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందించింది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. ఈ కేంద్రాల ద్వారా అందుతున్న (కియోస్క్) సేవలకు తిలోదకాలు ఇచ్చింది. మరోవైపు రైతులకు పెట్టుబడి రాయితీగా ఇచ్చిన రైతు భరోసా నిధులు కూడా ఏడాదిగా నిలిపివేసింది. సూపర్ సిక్స్ పథకాల్లో పొందుపర్చిన అన్నదాత సుఖీభవ పథకం ఈ ఏడాదికి చెల్లించకుండా మోసం చేసింది. రాష్ట్రంలో 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీహెచ్‌సీలకు తిలోదకాలు ఇచ్చి.. వారి అనుకూల రైతులకు మాత్రమే రాయితీలను అందించేలా నిర్ణయం తీసుకుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం..**

రైతులకు వ్యవసాయ యంత్రాలను రాయితీపై అందించేందుకు గత ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా గ్రామాల్లో రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి వాటిని కస్టమ్ హైరింగ్ సెంటర్లుగా పేరు పెట్టారు. ప్రతీ సంఘానికి రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల విలువైన వ్యవసాయ యంత్ర పరికరాలను అందించారు. వీటికి 40 శాతం రాయితీ, 60 శాతం బ్యాంక్ రుణంతో ట్రాక్టర్లు, నూర్పిడి యంత్రాలు, రోటో వీటర్లు, పవర్ టిల్లర్లు, స్ప్రేయర్లు, దుక్కి సెట్లు, కోత (చిన్నవి) మిషన్లు, తదితర వ్యవసాయ యంత్రాలను అందించారు. వీటిని ఆయా కమిటీ రైతులు వినియోగించుకోవటంతో పాటు వారి పరిధిలోని రైతులకు అద్దెకు ఇచ్చేలా నిబంధనలు రూపొందించారు.

| పాతపట్నం నియోజకవర్గంలో సీహెచ్‌సీ కమిటీల వివరాలు.. | | | | | |
|---|---|---|---|---|---|
| మండలం | కొత్తూరు | ఎల్.ఎన్.పేట | హిరమండలం | పాతపట్నం | మెళియాపుట్టి |
| సీహెచ్‌సీలు | 27 | 12 | 13 | 18 | 21 |

### జగనన్న పాలనలోనే మేలు



జగనన్న పాలనలోనే రైతులకు ఎంతో మేలు జరిగింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడి నుంచే రైతుకు అన్ని సేవలూ అందేవి. రైతులతో కమిటీలు ఏర్పాటు చేసి కావలసిన యంత్రాలను రాయితీపై అందించారు. నామమాత్రం అద్దె చెల్లించి యంత్ర పరికరాలను వినియోగించుకునేవారం. పంట పెట్టుబడి కోసం సీజన్ వారీగా రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేసేవారు.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

### పెట్టుబడి కోసం అప్పులు



ప్రస్తుతం పంట పెట్టుబడి కోసం అప్పులు చేయాల్సి వస్తోంది. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పండించిన పంటల పెట్టుబడి కోసం వడ్డీలకు అప్పులు చేశాం. ఇప్పుడు మరో ఖరీఫ్ సీజన్ వస్తోంది. ప్రస్తుతం పొలాలు దుక్కిలు చేయటంతోపాటు చెరువు మట్టిని పొలాల్లో వేసేందుకు పెట్టుబడి పెరిగిపోతుంది. రానున్న ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికైనా ప్రభుత్వం సాయం అందివ్వాలి.

– సీపాన ముత్యాలరావు, రైతు, తురకపేట, ఎల్.ఎన్.పేట

### తమ్మినేనికి అభినందనలు



తమ్మినేని సీతారాంను సత్కరిస్తున్న నాయకులు

**కొత్తూరు:** వైఎస్సార్‌సీపీ పీఏసీ మెంబర్‌గా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు కొత్తూరు మండలానికి చెందిన పార్టీ నాయకులు గురువారం ఆమదాలవలసలో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కొత్తూరు పీఏసీఎస్ మాజీ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ మాట్లాడుతూ సీతారాంను పీఏసీ మెంబర్‌గా పార్టీ అధిష్టానం నియమించడంతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం చెందుతుందన్నారు. సీతారాంను సత్కరించిన వారిలో కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, నియోజకవర్గ స్థాయి రైతు విభాగం అధ్యక్షుడు కృష్ణారావు, తదితరులు ఉన్నారు.

### విజ్ఞాన్ విద్యార్థుల సత్తా



మేఘన మోహన్‌కు స్వీట్ తినిపిస్తున్న ప్రిన్సిపాల్ గంగాధర్

**పాతపట్నం:** పదో తరగతిలో ఫలితాల్లో మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ డి.గంగాధర్ గురువారం తెలిపారు. నియోజకవర్గంలోనే తమ పాఠశాల మొదటి స్థానం దక్కించుకుందన్నారు. కొమరాపు మేఘన మోహన్ 595, పి.జోత్స్న 587, వై.భాగ్యశ్రీ 584, జి.భానుజ 583 మార్కులు సాధించారన్నారు. 94 శాతం ఉత్తీర్ణత సాధించామని, 500 మార్కులు 18 మంది విద్యార్థులు సాధించారన్నారు. గతంలో ఏపీఆర్‌జేసీలో మొదటి మూడు ర్యాంకులు విజ్ఞాన్ పాఠశాలకే వచ్చాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

### నగదు ప్రోత్సాహకం అందజేత



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ

**సారవకోట:** ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సారవకోట ఎమ్మార్సీ ఆవరణలో నగదు బహుమతిని ఎంఈఓ ఎం.వి.రమణ గురువారం అందించారు. కిడిమి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న రావాడ యోగేశ్వరరావు ఈ బహుమతులు సమకూర్చారు. అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కొల్లి శ్రీలత (586) మార్కులు సాధించినందుకు రూ.3 వేలు, చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముంజేటి యువశ్రీకి రూ.2 వేలు, యర్నాగుల ఆకాశ్‌కు రూ.వెయ్యి చొప్పున అందజేశారు.

## ఒకటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

**నరసన్నపేట:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మే ఒకటో తేదీ నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు సీనియర్ క్రికెటర్ నక్క రాము గురువారం తెలిపారు. రమేష్, శేఖర్‌ల జ్ఞాపకార్థం ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. పది ఓవర్ల ఫార్మెట్‌లో టెన్నిస్ బాల్‌తో క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 25వ తేదీలోగా ఎంట్రీలు పంపాలని, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1,100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. టోర్నీ విన్నర్స్‌కి రూ.30 వేల నగదు బహుమతి అందజేస్తామన్నారు.

ఆసక్తి ఉన్నవారు ఫోన్ నంబర్లను 7793967312, 8919015481 సంప్రదించి ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు.

### రూ.లక్ష విరాళం



నరసన్నపేట మండలంలోని కిల్లాం ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఆ స్కూల్ పూర్వ విద్యార్థి శిమ్మ భాగ్యలక్ష్మి రూ.లక్ష విరాళం గురువారం అందజేశారు. ఈ మేరకు ఎంఈఓ శాంతారావు తెలిపారు. ఈ మొత్తాన్ని స్కూల్ అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యార్థం కార్యక్రమాలను చేపట్టేందుకు వినియోగించాలని ఉపాధ్యాయులను కోరారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

- నరసన్నపేట

### నిరసన



పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని కాలనీ వాసులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణం ఇక్కడ పెట్టడంతో కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. కోర్టు, ఎంపీడీఓ కార్యాలయం, ఆర్‌డబ్ల్యూఎస్, వెలుగు తదితర ప్రభుత్వ కార్యాలయాలు మద్యం దుకాణం పక్కనే ఉన్నాయని కాలనీ వాసులు తెలిపారు.

- పాతపట్నం

### అవగాహన



తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా సాగు విధానం అలవాటు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ అడిషినల్ డీపీఎం ఎం.ధనుంజయరావు అన్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో పీఎండీఎస్ కిట్ల తయారీపై గురువారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. వరి వెద జల్లే పొలంలో భూ సారం పెంచేందుకు ఉపయోగపడేలా ఆరు రకాల విత్తనాలతో 2.250 కిలోల బరువు ఉండే 155 కిట్లను తయారు చేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

- ఎల్.ఎన్.పేట

### పొగపెట్టారు...



మెళియాపుట్టి మండల కేంద్రంలోని టెక్కలి వెళ్లే రహదారి (ప్రజలు నివసిస్తున్న ప్రదేశం) పక్కనే ఉన్న చెత్తకు గురువారం ఉదయం పంచాయతీ సిబ్బంది మంటపెట్టారు. దట్టమైన పొగతో రాకపోకలు కొనసాగించే వాహనదారులు ఇబ్బందిపడ్డారు. స్థానికులు సైతం పొగతో అవస్థలుపడ్డారు. చెత్తను గ్రామానికి దూరంగా తరలించి కాల్చితే ఇబ్బందులు తప్పుతాయని, ఈ విషయాన్ని పంచాయతీ యంత్రాంగం గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

- మెళియాపుట్టి

### ఉగ్రదాడి దారుణం



నరసన్నపేట: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు



పాతపట్నం: ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు



హిరమండలం: హిరమండలంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, తదితరులు

**పాతపట్నం/హిరమండలం/నరసన్నపేట:** జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. గురువారం ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండించారు. మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. పాతపట్నం, హిరమండలం, నరసన్నపేట మండల కేంద్రాల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

### దుప్పట్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, టోపీలను పంపిణీ చేస్తున్న అబ్బాయి, తదితరులు

**హిరమండలం:** సత్యసాయి బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరమని స్థానిక ప్రేమసాయి వృద్ధాశ్రమం అధ్యక్షుడు అంధవరపు అబ్బాయి అన్నారు. వృద్ధాశ్రమంలో భగవాన్ సత్యసాయి అరాధనోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాటచారులకు గొడుగులు అందించారు. దాహార్తి తీర్చేందుకు ఆశ్రమం ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు, టోపీలు పంపిణీ చేశారు. సేవా సంస్థల జోనల్ కన్వీనర్ చంటి మాస్టర్, సమన్వయకర్త సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

### పే స్కేల్ అమలు చేయాలి



తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

**పాతపట్నం:** తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలోని వీఆర్‌ఏలకు కూడా పే స్కేల్ అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వీఆర్‌ఏలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని పాతపట్నం మండలంలోని వీఆర్‌ఏలు కోరారు. గురువారం తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రాత్రుల్లో డ్యూటీలు వేయడం వెంటనే విరమించాలన్నారు. ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, వీఆర్వో పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలకు ప్రమోషన్లు ఇచ్చి భర్తీ చేయాలన్నారు. ఈ నెల 30వ తేదీన చలో కలెక్టరేట్ నిర్వహించనున్నామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పి.వి.రమణ, బి.రాజారావు, పి.అప్పలస్వామి, వై.రామారావు, ఆర్.సావిత్రి, పి.సుజాత, వి.అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

### క్రీడలతోనే మానసిక ఉల్లాసం



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

**ఆమదాలవలస:** క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో చిరంజీవి మెమోరియల్ క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధ్యక్షుడు తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కప్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలో క్రికెట్ క్లబ్, స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. చిరంజీవి మెమోరియల్ క్రికెట్ కమిటీకి తన వంతుగా లక్ష రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే ప్రకటించారు. క్రికెట్ అసోసియేషన్ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మెళియాపుట్టి:** మెళియాపుట్టి సబ్ స్టేషన్ పరిధి తిడ్డిమి ఫీడర్‌లో శుక్రవారం మరమ్మతులు నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని వసుంధర, రట్టిణి, పెద్దపద్మాపురం, సుందరాడ, నేలబొంతు, ఆంపురం, మర్రిపాడు-సి నుంచి బందపల్లి, జంతూరు, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

### సచివాలయం ప్రారంభం

**పొందూరు:** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రాపాక కూడలిలో నిర్మించిన చెత్త సంపద కేంద్రాన్ని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ గురువారం ప్రారంభించారు. రోడ్లు, మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సర్పంచ్ రేగిడి లక్ష్మి, ఎంపీడీఓ మన్మధరావు, ఈఓ మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

### సోలార్ పరికరాలు చోరీ

**హిరమండలం:** మండలంలోని గులుమూరులో సోలార్ పరికరాలు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన కౌలు రైతు కేత సురేష్ తన పొలంలో సోలార్ పంపు సెట్ ఏర్పాటుచేశాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.3 లక్షల విలువైన సోలార్ పరికరాలు దొంగిలించారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సురేష్ తెలిపారు.

### రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలి



ఆక్రమణకు గురవుతున్న రహదారి ఇదే..

**ఆమదాలవలస రూరల్:** మండలంలోని కనుగులవలసలో రహదారి ఆక్రమణను అడ్డుకోవాలని ఉన్నతాధికారులను గ్రామానికి చెందిన బెండి గోవిందరావు, తదితరులు కోరారు. ఈ రహదారిని టీడీపీ నాయకుల అండతో కొంతమంది ఆక్రమిస్తున్నారన్నారు. దీనివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి ఫిర్యాదు విభాగానికి కూడా ఫిర్యాదు చేశామన్నారు. రహదారి ఆక్రమణకు అడ్డుకట్టు వేసి.. ప్రజలు రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఎంపీపీలు అధ్యక్షత వహించారు. అధికారులు పంచాయతీరాజ్ దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులను సత్కరించారు. పలుచోట్ల గ్రామ సభలు నిర్వహించారు.

- సాక్షి నెట్‌వర్క్



సారవకోట: ఎంపీడీఓను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు



పాతపట్నం: ఎంపీపీ దొర సావిత్రమ్మ, ఉద్యోగులను సత్కరిస్తున్న ఎంపీడీఓ చంద్రకుమారి



ఎల్.ఎన్.పేట: చింతలబడవంజ గ్రామ సభలో మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు పి.వెంకటరావు



జలుమూరు: ఎంపీపీ వాన గోపిని సన్మానిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు, తదితరులు



నరసన్నపేట: ఎంపీపీ ఆరంగి మురళిని సత్కరిస్తున్న అధికారులు, ఎంపీటీసీలు



కొత్తూరు: ఎంపీపీ సవర సావిత్రిని సత్కరించిన ఎంపీడీఓ నీరజ, తదితరులు



బూర్జ: జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావును సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు